క్లుప్తంగా

పనులు పారదర్శకంగా చేపట్టాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఈఈ రాము తదితరులు

ముమ్మిడివరం: రహదారి పనులను పారదర్శకంగా చేపట్టాలని ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం శివారు కొండాలమ్మ చింత-భగవాన్ బాల యోగీశ్వరుల ఆశ్రమం వరకూ రూ.1.20 కోట్లతో చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. సుమారు కిలోమీటరు మేర 18 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ పనులను అత్యంత పారదర్శంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డీఈఈ కేఎస్ రాఘవరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందనలు

అమలాపురం టౌన్: అమలాపురం ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాస్టర్స్ 74 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన చీకురుమిల్లి కిరణ్‌కుమార్‌ను స్థానిక హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్‌లో క్రీడాకారులు మంగళవారం అభినందించారు. జిమ్ సభ్యుడైన కిరణ్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



విలసవిల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో జరిగిన పనులపై చర్చ జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఏపీవో వి.రాజామణి, పంచాయతీ కార్యదర్శి పి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు పలికిన గణపతి లడ్డూ

అమలాపురం రూరల్: చిందాడగరువు గ్రామంలో సీతారామాలయం వద్ద గణపతి పందిరిలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలో గణపతి లడ్డూను గ్రామానికి చెందిన గుబ్బుల రాంబాబు రూ.50 వేలకు దక్కించుకున్నారు. పాటదారునికి ఆలయ కమిటీ సభ్యులు లడ్డూను అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించి గణపతిని నిమజ్జనం చేశారు.

వచ్చే నెల 2 వరకూ పిత్ళ దేవతా మహోత్సవాలు



అమలాపురంలో పిత్ళ దేవతా మహోత్సవాల పతాకాన్ని ఎగురవేస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: మానవ జాతి సమస్త జీవరాశి సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో వచ్చే నెల 2వ తేదీ వరకూ షోడశ రాత్రి పిత్ళ దేవతా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గౌతమ అక్షయ పాత్ర సంస్థ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన పిత్ళ దేవతా మహోత్సవాలు అక్షయ పాత్ర ప్రతినిధులు పోతురాజు రామకృష్ణారావు, నాగ కనకదుర్గ దంపతుల ఆధ్వర్యంలో మొత్తంగా 16 రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీఆది శేష నిలయం ప్రాంగణంలో మహోత్సవాల పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆటోనగర్ ఏర్పాటుకు కృషి



మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావులను సత్కరిస్తున్న వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కూడా చొరవ చూపుతామని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాథూర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు అన్నారు. అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో వారు ముగ్గురినీ మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కోశాధికారి సరెళ్ల రమేష్‌బాబు, అనిల్‌కుమార్ జైన్, కుప్పాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం

- ఏటా వరదతో జీవనోపాధి కోల్పోతున్న గంగపుత్రులు
- ప్రకటనలకే పరిమితమైన రూ.3 వేల పరిహారం
- సహాయక చర్యలు అందించడంలో అధికారుల విఫలం



వరదకు కూలిపోయిన ఇంటి ముందు కాలాడి నాగలక్ష్మి



వరద వల్ల ముంపునకు గురైన బోడసకుర్రులోని మత్స్యకార కాలనీ

అల్లవరం: వారంతా గంగపుత్రులు. నిత్యం గోదావరిని నమ్ముకుని రాత్రి పగలన్న తేడా లేకుండా వేటే వృత్తిగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు. రెక్కాడితేగాని డొక్కాడని మత్స్యకార కుటుంబాలు ఏటా వెంటాడుతున్న వరద కారణంగా జీవనోపాధిని కోల్పోతున్నారు. పోనీ వరదల సమయంలో ముంపు బాధితులకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం అందించి ఆదుకుందా అంటే అదీ లేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల సాయం ప్రకటనలకే పరిమితమై పోవడంపై బాధితులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడుసార్లు వరద

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని మత్స్యకార కాలనీలోకి జూలై 29న వరద పోటెత్తింది. పల్లిపాలెంలో మత్స్యకారులకు చెందిన 54 ఇళ్లు వరద ముంపులో చిక్కుకుని మొత్తంగా 90 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వారం రోజుల పాటు బాధితులంతా వరద నీటిలోనే బతుకు జీవుడా అంటూ జీవనం సాగించాల్సి వచ్చింది. వరద సమయంలో స్థానిక ఎంపీపీ పాఠశాలలో పిల్లలు, వృద్ధులకు మాత్రమే పునరావాసం కల్పించారు. గర్భిణులు, బాలింతలకు పూర్తి స్థాయి సౌకర్యాలు లేక వారి బంధువుల ఇంటికి వెళ్లవలసిన పరిస్థితి తలెత్తింది. 45 రోజుల వ్యవధిలో బోడసకుర్రు పల్లిపాలేనికి మూడు సార్లు వరద పోటెత్తింది. రెండోసారి, మూడోసారి వచ్చిన వరద బాధితులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వరద నీటిలో చిక్కుకున్న కుటుంబాలకు కేవలం మంచినీరు మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారని బాధితులు ఆవేదన చెందారు. ఈ నెల 13న స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వరద బాధితులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేయగా చాలీచాలని, ఉడికీఉడకని భోజనాలు ఇచ్చారంటూ వరద బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద నీటిలో ఉన్న బాధిత కుటుంబాలను కూటమి నేతలు పరామర్శించకుండానే తిరిగి వెళ్లారని తమ బాధలు వారి కంటికి కనిపించలేదని మహిళలు మండిపడ్డారు.

రూ.3 వేల పరిహారం ఏమైంది?

వరద బాధిత కుటుంబాలకు రూ.3 వేల పరిహారం ఇస్తామని ఆగస్టు మొదటి వారంలోనే కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వరదలతో ఇళ్లు మునిగి సామాన్లు పాడై, ఇళ్లు కూలిపోయి, జీవనోపాధి కోల్పోతే పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సార్లు వరద వస్తే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఒక్కసారైనా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు వచ్చి వివరాలు రాసుకుపోవడమే తప్ప వారి నుంచి ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదంటున్నారు. వరదల కారణంగా నీట మునిగిన బాధిత కుటుంబాలకు గత ప్రభుత్వ హయాంలో తక్షణ సాయంగా వరద తగ్గిన వెంటనే రూ.2 వేలు ప్రతి కుటుంబానికి అందించారని మహిళలు తెలిపారు. అంతేకాకుండా వరదల సమయాల్లో వలంటీర్ల ద్వారా సహాయ సహకారాలు అందించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవేమి పట్టలేదంటున్నారు.

ఇల్లు కూలిపోయినా పరిహారం ఇవ్వలేదు

మొదటిసారి వచ్చిన వరదలకు మా ఇల్లు కూలిపోయింది. నా భర్త ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో మా ఆర్థిక పరిస్థితి బాగోక ఇల్లు నిలబెట్టుకోలేకపోయాను. ప్రస్తుతం మా బంధువుల ఇంట్లో ఉంటున్నాం. అధికారులు వచ్చి వివరాలు రాసుకున్నారు కాని ఏవిధమైన పరిహారం అందలేదు.
– కాలాడి నాగలక్ష్మి, బాధితురాలు, బోడసకుర్రు

ప్రకటించిన రూ.3 వేలు ఇవ్వలేదు



వరదల కారణంగా ముంపు బాధిత కుటుంబాలకు రూ.3 వేలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని అధికారులు ఇంటింటికి వచ్చి చెప్పారు. నెలన్నర రోజులు కావొస్తున్నా రూ.3 వేలు ఇవ్వలేదు. మూడోసారి వరద వస్తే ఎలా ఉన్నారని ఏ నాయకుడు వచ్చి పలకరించిన పాపాన పోలేదు.
– కర్రి పుణ్యవతి, బాధితురాలు, బోడసకుర్రు

ఎస్పీ కృష్ణారావుకు వైద్యుల వినతి పత్రం



ఎస్పీ కృష్ణారావుకు వినతి పత్రం అందిస్తున్న జిల్లా ఐఎంఏ వైద్య బృందం

అమలాపురం టౌన్: ఇటీవల కాలంలో అమలాపురం డాక్టర్ల గురించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ బి.కృష్ణారావుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా శాఖ వైద్య ప్రతినిధులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఐఎంఏ వైద్యుల బృందం వెళ్లి ఎస్పీ కృష్ణారావును కలిసి విన్నవించారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా అవాస్తవాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఎంఏ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ కడలి ప్రసాద్, జిల్లా ఐఎంఏ సీనియర్ వైద్యులు జి.ప్రభాకర్, బి.రాఘవేంద్రరావు, పీఎస్ శర్మ, కారెం రవితేజ, కె.రమణకుమార్, శ్రావణి, రేవతి, స్మిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు



విజేతలతో జిమ్ సభ్యులు

ముమ్మిడివరం: ఇటీవల అమలాపురంలో జరిగిన ఏపీ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 15 మంది పోటీల్లో పాల్గొనగా 4 గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్స్ గెలిచారు. జూనియర్ 120 కేజీల విభాగంలో దొమ్మేటి వేణుసాగర్, ఓవరల్ బ్రాంజ్ మెడల్, బెంచ్ ప్రెస్‌లో సిల్వర్ మెడల్, జూనియర్ 93 కేజీల విభాగంలో నారాయణ, జూనియర్ 120 కేజీల విభాగంలో అప్పడి సత్యనారాయణ ఓవరల్ గోల్డ్ మెడల్, బెంచ్ ప్రెస్ గోల్డ్ మెడల్ గెలిచారని కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు. విజేతలను సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఎనుమల పద్మరాజు, జిల్లా అధ్యక్షులు వెంటిద్దు వెంకన్న నాయుడు, డా.కంకిపాటి వేంకటేశ్వరరావు, మట్టపర్తి సముద్రం, గణేష్‌లు అభినందించారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం



గురుకుల పాఠశాల వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థినులు



తాళ్లరేవులో స్వచ్ఛతాహి ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్



కొమరగిరిపట్నంలో స్వచ్ఛతాహి సేవపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



యానాంలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

ముమ్మిడివరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేద్దాం-పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గొలకోటి దొరబాబు, నడింపల్లి శ్రీనురాజు, చెల్లి అశోక్, పాఠశాల చైర్మన్ నల్లా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ గంగా భవాని, పీఈటీ ప్రమీల, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. మంగళవారం తాళ్లరేవు పంచాయతీలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన జరిగిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో 15 రోజులపాటు ఈ కార్యక్రమాలు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా పారిశుధ్యంపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం, ఫ్లెక్సీలతో ప్రదర్శన, ర్యాలీలు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బొమ్ము బాలవేణి, బర్రే సీతారత్నం, తోట శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు మౌనిక, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామంలో సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి డేవిడ్, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

యానాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవా ర్యాలీని మంగళవారం యానాంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, ఏఈ ఎం.శ్రీనివాసకుమార్, ఎస్.దేవానంప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



అమలాపురంలో విశ్వకర్మ జెండాను ఎగురవేస్తున్న చేతివృత్తుల సంక్షేమ సంఘం సభ్యులు



ముమ్మిడివరంలో విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు



మురమళ్లలో విశ్వకర్మ చిత్రపటం వద్ద వివిధ చేతివృత్తుల వారు

అమలాపురం టౌన్: జిల్లా దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో భగవన్ విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సంఘం జిల్లా కన్వీనర్ కొనుకు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయన జిల్లా సంఘ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూజ చేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో విశ్వ కర్మ జెండాను ఎగర వేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, పితాని బేబీరావు, కేతా సోమేశ్వరరావు, కుసుమ నరసింహారావు, యార్లగడ్డ అరుణకుమార్ పాల్గొన్నారు. పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ సంఘం, పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో విరాట్ విశ్వకర్మ భగవాన్ మహా యజ్ఞ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది.

ముమ్మిడివరం: ముమ్మిడివరం పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయం వద్ద విశ్వబ్రహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భగవాన్ శ్రీవిశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: సమరత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని మురమళ్ల ఉన్నత పాఠశాల వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు ఎస్ఎస్ఎఫ్ మండల సహ కన్వీనర్ లంక వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ముందుగా కాకిలేటి వెంకటేశ్వరరావు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు, పెట్టా నాగబాబు, శీలం రామకృష్ణ, కానూరి వెంకటరమణ, పితాని దుర్గారావు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, పలివెల రమణ, దొమ్మేటి మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు గర్భకోశ చికిత్సా శిబిరం

తాళ్లరేవు: పత్తిగొంది పశువైద్యశాల పరిధిలో ఉన్న నీలపల్లి పంచాయతీ నేరెళ్లంక గ్రామంలో మంగళవారం పశు గర్భకోశ చికిత్సా శిబిరాన్ని వైద్యురాలు దవులూరి సుధ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర గోకుల్ మిషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ చిట్టూరి నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 34 ఆవులకు, 29 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా 45 పశువులకు నట్టల నివారణ చికిత్స అందించారు. శిబిరంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ డి.బ్రహ్మవేద, వైద్యాధికారులు సీహెచ్ శ్రీనివాస్, శుభశ్రీ, రమణమూర్తి, ప్రియాంక, సుధాగంగామయి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం




బాధితుడికి సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: రావులచెరువులో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడులో గాయపడిన గొవ్వాల నాగేశ్వరరావు కుటుంబానికి శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ కమిటీ ఆర్థిక సాయం చేసింది. వాసంశెట్టి జగదీష్ ఆధ్వర్యంలో బాధితుడు నాగేశ్వరరావు కుటుంబానికి రూ.15 వేలు మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో యాక్షన్ ఫోర్స్ ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడు విత్తనాల సత్యనారాయణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం టౌన్: రావులచెరువులో జరిగిన బాణసంచా పేలుడులో క్షతగాత్రులైన బాధితులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రావులచెరువులోని ఘటన స్థలాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అమలాపురంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

అమలాపురం రూరల్: రావులచెరువులో బాణసంచా ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన క్షతగాత్రులను కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము తదితరులు పాల్గొన్నారు.


నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తున్న డీఐఈవో సోమశేఖరరావు



పి.మల్లవరంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న అధికారులు



కేశనకుర్రులో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అమలాపురం టౌన్: జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) వనుము సోమశేఖరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మంగళవారం ఆయన అల్బెండజోల్ మాత్రలను అందించి వారి చేత మింగించారు. నులి పురుగులు కడుపులో ఉంటే రక్తహీనత కలిగి నీరసం వస్తుందని, శారీరక, మానసిక పెరుగుల కూడా తగ్గుతుందని డీఐఈవో అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శిరీష, కళాశాల లైబ్రేరీ ఇన్‌చార్జి వై.సుబ్బారావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గల 570 మంది విద్యార్థులకు డీవార్మింగ్ మందులను ఎంపీడీఓ ఎం.అనుపమ సమక్షంలో వేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, ధూళిపూడి వెంకటరమణ, పంపన రామకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అభినవ్, తనీషా, పుష్ప, అనంత, పార్వతి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పలగుప్తం, ఎస్.యానాం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గొల్లవిల్లి, చల్లపల్లి పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇసుకపట్ల జయమణి, జొన్నాడ శ్రీదుర్గ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్ వాడీ సెంటర్లు, కాలేజీల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది మంగళవారం పంపిణీ చేశారు. 2 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలకు వీటిని అందజేశారు. కేశనకుర్రు, కేశనకుర్రు పాలెం, ఐ.పోలవరం, మురమళ్ల, పశువుల్లంక, కొమరిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో డీఎస్పీ పర్యటన

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో మంగళవారం రాత్రి కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యటించారు. చినబొడ్డు వెంకటాయపాలెం, పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించే అమ్మవార్ల జాతరలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకుగాను కోరంగి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణతో కలిసి డీఎస్పీ ఆయా గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. మహాలక్ష్మి అమ్మవార్ల జాతర్లలో ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆయన వెంట కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, వైదాడి శ్రీనివాస్, వాడ్రేవు వీరబాబు, కొపనాతి నాగరాజు తదితరులు ఉన్నారు.

కాలానికి అనుగుణంగా బోధించాలి

ఉప్పలగుప్తం: అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అనుసరించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కాలానుగుణంగా నూతన బోధాన పద్ధతులను అలవర్చుకోవాలని సమగ్రశిక్ష ఏపీడీ ఎ.మధుసూదనరావు సూచించారు. భీమనపల్లి పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీఎంవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.